క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీ



నర్సంపేట : నర్సంపేట ప్రాజెక్టు పరిధిలోని 14 సెక్టార్లలోని అంగన్‌వాడీ కేంద్రాలను 11 మంది పర్యవేక్షకులు బుధవారం తనిఖీ చేశారు. ఎన్‌హెచ్‌టీఎస్, పోషణ్ ట్రాకర్‌ల్లో లబ్ధిదారుల నమోదు, హాజరు శాతం, రికార్డులు, పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం సూపర్‌వైజర్ రాధ, స్థానిక అంగన్‌వాడీ టీచర్ నల్ల భారతి మాట్లాడారు. ఆరోగ్యలక్ష్మి పథకం, అంగన్‌వాడీ సేవల గురించి వివరించారు. ప్రతిరోజూ గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాలకు హాజరై భోజనం చేయాలని కోరారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



సాక్షి నెట్‌వర్క్ : కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో అన్ని వర్గాలకు పెద్దపీట వేసిందంటూ బీజేపీ నాయకులు జిల్లావ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటాలకు బుధవారం క్షీరాభిషేకం చేశారు. నర్సంపేట, వర్ధన్నపేట, పర్వతగిరి, దుగ్గొండి, గీసుకొండ, చెన్నారావుపేట, తదితర మండలాల్లో ఆ పార్టీ మండల కమిటీల ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సంపేటలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణాప్రతాప్‌రెడ్డి, మిగతా మండలాల్లో మండల అధ్యక్షులు మాట్లాడారు. కార్యక్రమాల్లో పార్టీ, ఓబీసీ మోర్చా నాయకులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి..



సంగెం/గీసుకొండ : సామాజిక, ఆర్థిక, కులగణనకు, ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో ఆమోదం పొందిన క్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల కమిటీల ఆధ్వర్యంలో సంగెం మండల కేంద్రంలో, గీసుకొండ మండలంలోని కోనాయిమాకులలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షులు చొల్లేటి మాధవరెడ్డి, తుమ్మనపెల్లి శ్రీనివాస్ మాట్లాడారు. బీసీలకు 42 శాతం సీట్లు కేటాయిస్తామని ప్రకటించడం, ఎస్సీ వర్గీకరణకు ఆమోదం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో జిల్లా, నియోజకవర్గ అధికార ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, జనగాం రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

కేజీకేఎస్ అధ్యక్షుడిగా సోమయ్య ఎన్నిక

రాయపర్తి : మండలంలోని కొండూరుకు చెందిన పులి సోమయ్య కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) మండల అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. గ్రామంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల్నె వెంకటమల్లయ్య కమిటీని ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా పెద్దగోని సంపత్, ఉపాధ్యక్షులుగా నాలం రవి, మందపురి రాజు, నాగపురి సోమయ్య, మేర్గు రమేశ్, ఖమ్మం సోమన్న, పదీర్ల రాజు, కోలుకొండ నారాయణ, గాజుల అశోక్, కార్యదర్శులుగా బాలగోయిన రాంబాబు, మొలుగూరి పున్నమయ్య, మండల నరేందర్, కోల యాకయ్య, రామ్మూర్తి, మేర్గు ప్రభాకర్, కోల కొమురయ్య, పెద్దగోని ఎల్లగౌడ్, తాండాల సుధాకర్, సోషల్ మీడియా కన్వీనర్లుగా మండల మధూకర్, పంతంగి వేణు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడారు. గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం ఆయన్ను బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు.

బీఆర్‌ఎస్ కమిటీ ఎన్నిక

దుగ్గొండి : మండలంలోని మర్రిపల్లిలో బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడుగా ఎరుకల బుచ్చిరెడ్డి, అధ్యక్షుడుగా ఇట్టబోయిన స్వామి, ఉపాధ్యక్షులుగా కుక్కముడి రమేశ్, వంగ ఎర్రయ్య, ప్రధాన కార్యదర్శిగా పెండ్లి మహిపాల్, సహాయ కార్యదర్శులుగా కసివోజుల రవి, ఎరుకల శోభన్‌బాబు, కోశాధికారిగా బూరుగుల దేవరాజ్, ప్రచార కార్యదర్శులుగా రాధారపు శ్రీనివాస్, పెండ్లి సాయివర్ధన్, కార్యవర్గ సభ్యులుగా పొన్నాల లచ్చిరెడ్డి, ఒలిగె కిషన్, మేరుగు బుచ్చయ్య, శ్రీపతి రవి, కుక్కముడి ప్రభాకర్, పులి బాబు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జ్ తోటకూరి రాజు వ్యవహరించారు.

బీమా చెక్కు అందజేత

పర్వతగిరి : మండలంలోని నరగొడ్లతండాకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త అసవత్ లక్ష్మణ్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బుధవారం రూ.2 లక్షల బీమా చెక్కు అందజేశారు. తొలుత లక్ష్మణ్ కుటుంబాన్ని దయాకర్‌రావు పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, సొసైటీ చైర్మన్ మనోజ్‌గౌడ్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ బోయినపల్లి యుగంధర్‌రావు, మాజీ ఎంపీటీసీ మాడుగుల రాజు, తదితరులు పాల్గొన్నారు.

చపాటా మిర్చిలో కాయకుళ్లు తెగులు

- నిర్లక్ష్యం చేస్తే అపార నష్టం
- కల్లాల్లోనే తాలుగా మారుతున్న దుస్థితి



సంగీత లక్ష్మి, ఉద్యాన అధికారి

దుగ్గొండి : చపాటా మిర్చిలో కాయకుళ్లు తెగులు కనపడుతోంది. నివారణలో నిర్లక్ష్యం చేస్తే అపార నష్టం తప్పదు. మండలంలోని తిమ్మంపేట, మహ్మదాపురం, మర్రిపల్లి, మల్లంపల్లి గ్రామాల్లో 1411 ఎకరాల్లో రైతులు ఈ రకం మిర్చి పండిస్తున్నారు. చపాట మిర్చి ప్రస్తుతం పూత, కాత దశలో ఉంది. ప్రతిరోజు మూలమంచు విపరీతంగా వస్తున్న క్రమంలో కాయకుళ్ల తెగులు కనపడుతోందని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి సంగీతలక్ష్మి సూచించారు. నిర్లక్ష్యం చేస్తే తాలుగా మారి తీవ్ర నష్టం వాటిల్లుతోందని చెప్పారు.

లక్షణాలివే..

పక్వానికి వచ్చిన కాయలపై వృత్తాకారం లేదా అండాకారం నల్లటి మచ్చలు వస్తాయి. తెగులు ఉధృతంగా సోకిన కాయలు సాధారణ ఎరుపు రంగుకు బదులు గడ్డిపరక రంగులోకి మారి



నల్లమచ్చల తెగులు సోకిన ఎండు మిరప తోట

ముడతలు పడి ఎండిపోతాయి. తెగులు కనిపించిన వెంటనే నివారణ చర్యలు చేపట్టాలి. అశ్రద్ధ చేస్తే దిగుబడి గణనీయంగా తగ్గిపోయే ప్రమాదం ఉంది. మచ్చకాయలుగా మారడంతో మార్కెట్‌లో రేటు పడిపోయే అవకాశం ఉంది.

కల్లాల్లో కాయలకు మచ్చలు..

కొద్ది రోజులుగా తెల్లవారుజామున భారీ మంచు కురుస్తుండడంతో కల్లాల్లో ఆరబోయిన మిరప కాయలు తెల్లగా మారే అవకాశాలున్నాయి. తద్వారా తాలు పెరిగే అవకాశం ఎక్కువ. మంచు కారణంగా సగం పంట తాలుగా మారుతుండటంతో రైతన్నలు వేదనకు గురౌతున్నారు.

నివారణ చర్యలు..

లీటరు నీటికి ప్రోఫికానాజోల్ మిల్లీలీటరు లేదా డైఫెన్ కోనాజోల్ 0.5 మిల్లీలీటర్లు లేదా అజాక్సీస్ట్రోబిన్ మిల్లీలీటరు లేదా కాపర్ హైడ్రాక్సైడ్ 2.5 గ్రాములు లేదా పైరాక్లోస్ట్రాబిన్‌తోపాటు కాబ్రియోటాఫ్ 3 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలి. పూతదశలో ఒకసారి, మిరపకాయలు పండుబారే సమయంలో మరోసారి పిచికారీ చేయాలి. కల్లాల్లో ఆరబోసిన మిరపకాయలపై టార్పాలిన్ షీట్లు కప్పి ఉదయమే తీసేయాలి. తద్వారా తాలు కాకుండా కాపాడొచ్చు. కాయకుళ్ల తెగులు సోకిన మొక్కల నుంచి విత్తనాలు సేకరించవద్దు.

హామీలను విస్మరిస్తే గుణపాఠం తప్పదు

- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ఖానాపురం : రైతుభరోసా, బోనస్, రేషన్ కార్డులు, తదితర హామీలను విస్మరిస్తే రాష్ట్ర ప్రభుత్వానికి, మంత్రులకు, ఎమ్మెల్యేలకు గుణపాఠం తప్పదని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని బుధరావుపేటలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ నుంచి ఎస్‌కేఎస్ వివరాలు మాయం చేశారని చెప్పారు. బీసీ కులగణనకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చి సాధ్యం కాదంటూ నయా మోసానికి తెరలేపిందని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి రోజుకో మాట మాట్లాడుతూ ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారని తెలిపారు. బీసీ కులగణనలో సీఎం చేస్తున్న మోసపూరిత వ్యాఖ్యలకు వంతపాడే మంత్రులు, ఎమ్మెల్యేలందరినీ గజదొంగలుగా అభివర్ణించారు. పథకాల్లో కోత పెట్టడం దుర్మార్గమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ పేరుతో మరో కుట్ర జరుగుతోందని తెలిపారు. ఎన్నికల కోసం గ్రామాలకు వచ్చే కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలకు ప్రజలు, రైతులు చెప్పుల దండలతో స్వాగతాలు పలుకుతారని హెచ్చరించారు. సమావేశంలో మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్య, ఉపేందర్‌రెడ్డి, బాలునాయక్, మౌలానా, భూస అశోక్, పూర్ణ, పసునూరి వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



ర్యాలీలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో పావని, ఎస్సై, తదితరులు

- సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ పావని

చెన్నారావుపేట : బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని మహిళా సాధికారత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ పావని ఆకాంక్షించారు. సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని అమీనాబాద్ మోడల్ స్కూల్‌లో బుధవారం నిర్వహించిన 'బేటీ బచావో.. బేటీ పఢావో' అవగాహన ర్యాలీ సందర్భంగా ఆమె మాట్లాడారు. దేశంలో స్త్రీ, పురుషుల నిష్పత్తిని పరిశీలిస్తే స్త్రీల సంఖ్య గణనీయంగా తగ్గుతోందని తెలిపారు. ఈ క్రమంలో బాలికలను పుట్టనివ్వాలని, చదవనివ్వాలని ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రభుత్వం కార్యక్రమం చేపట్టిందని చెప్పారు. బాలికలు అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని ఆకాంక్షించారు. విద్యార్థి దశలోనే చదువుల్లో రాణించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకుంటే సమాజ ఉన్నతికి బాటలు పడతాయని చెప్పారు. ప్రముఖ జెండర్ స్పెషలిస్ట్ హర్షిత మాట్లాడుతూ బాలికలు సమాజాన్ని అధ్యయనం చేయాలని సూచించారు. కేవలం చదువులకే పరిమితం కాకుండా ఆటపాటల్లోనూ, ఇతర అన్ని రంగాల్లోనూ రాణించేలా ప్రణాళికాయుతంగా ముందుకు సాగాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై రాజేశ్‌రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

'బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి'



నర్సంపేట : వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నర్సంపేట : ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ హక్కుల సాధన సమితి నర్సంపేట కన్వీనర్ మహాదేవుని జగదీశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సాధన సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని అమరవీరుల స్తూపం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు బుధవారం నిరసనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ ఉమారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జగదీశ్ మాట్లాడారు. ఆంగ్లేయుల పాలనలో 1931లో తప్ప దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టలేదన్నారు. బీసీలకు జనాభా మేరకు చట్టసభల్లో, బడ్జెట్‌లో వాటా దక్కాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోకన్వీనర్లు ఓర్సు సాంబయ్య, ఆకారపు మోహన్, షేర్ల శ్రీనివాస్, కూచన రవీందర్, ఇల్లందుల తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లి : బీసీ హక్కుల సాధన సమితి మండల కోకన్వీనర్ మేడిపల్లి రాజు ఆధ్వర్యంలో తహసీల్దార్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం రాజు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు పాండవుల రాంబాబు, బత్తిని మల్లయ్య, నానబోయిన నరేశ్, కోల లింగయ్య, భూస కుమారస్వామి, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

లడఖ్ బృందం అధ్యయనం



నర్సంపేట : పట్టణంలో పీడీఎం మహిళా శక్తి ఈవెంట్ ప్లానర్ రావుల మానస నిర్వహిస్తున్న వ్యాపారాన్ని లడఖ్ బృందం బుధవారం అధ్యయనం చేసింది. ఈ సందర్భంగా బృందానికి మానస తను చేపట్టిన, ప్రభుత్వం అందిస్తున్న సహకారం, తదితర వివరాలను వివరించింది. సమాజంలో మహిళలు అభివృద్ధి చెందే దిశగా మహిళా సంఘాలు తీసుకుంటున్న చొరవ, శిక్షణ, ఉపాధి, తదితరాలపై అవగాహన కల్పించారు.

మెడికల్ కళాశాల క్యాంటిన్‌లో..

నర్సంపేట రూరల్ : పట్టణ శివారులోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మండలంలోని నాగుర్లపల్లి గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాంటిన్‌ను లడఖ్ బృందం సందర్శించింది. ప్రభుత్వం అందిస్తున్న సహకారం, క్యాంటిన్ నిర్వహణ, తయారు చేస్తున్న వంటలు, స్వీట్లు పరిశీలించారు. రోజువారీ ఆదాయం, ఖర్చుపై తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో డీపీఎం నీలవేణి, ప్రగతి గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు కాంపెల్లి వీణ, శివాని, వీఓఏలు భాగ్యలక్ష్మి, అరుణ, ఏపీఎం మహేందర్, సీసీ యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- విజిలెన్స్ కమిటీ సభ్యుడు విజయ్‌కుమార్



భోజనాన్ని పరిశీలిస్తున్న విజయ్‌కుమార్, హెచ్‌ఎం

నల్లబెల్లి : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి విజిలెన్స్, మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడు పాలకుర్తి విజయ్‌కుమార్ కోరారు. అంతర్జాతీయ మానవ హక్కుల ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని హైస్కూల్‌ను బుధవారం సందర్శించి ఇన్‌చార్జ్ హెచ్‌ఎం పద్మజతో కలిసి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన నిర్వహణపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం విజయ్‌కుమార్ మాట్లాడారు. మెనూ అమలులో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ మహిళా అధ్యక్షురాలు సుభద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

పర్వతగిరి : మండలంలోని చింతనెక్కొండ శివారు బట్టుతండాలో మెడికేర్ ఆస్పత్రి యాజమాన్యం మాజీ సర్పంచ్ బట్టు అశోక్ చొరవతో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఏనుగు రాకేశ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై వైద్యశిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. హెల్త్‌క్యాంపులు ఏర్పాటు చేస్తూ పేదలకు గుండె జబ్బులు, డయాలసిస్ రక్త పరీక్షలు, మందులు ఉచితంగా అందజేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ ధర్నోజు దేవేందర్, బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు శెట్టి రఘు, కార్యదర్శి జీడి ప్రసాద్, వార్డు సభ్యుడు జీడి గట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగర పరిధిలోని 16వ డివిజన్ ధర్మారం శివారులోని సరిత క్వాలిటీ ఫ్యూయల్ (హెచ్‌పీ పెట్రోల్ పంపు) నిర్వాహకులు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పెట్రోల్, డీజిల్ కోసం వచ్చే వారితోపాటు స్థానికులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో పెట్రోల్ పంపు యజమాని తోట సంతోశ్, వైద్యులు లక్ష్మణ్, శ్రీనాథ్, నవీన్, రమేశ్, డీఎంఓ కాంతి స్వరూప్, సిబ్బంది పాల్గొన్నారు.

పశు వైద్య..

దుగ్గొండి : మండలంలోని రాజ్యతండాలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 58 పశువులకు పరీక్షలు నిర్వహించారు. అలాగే ఎదకురాని 31 పశువులకు మందులు అందజేశారు. మరో 27 దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి శారద మాట్లాడారు. కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ జహంగీర్, గోపాలమిత్రలు అక్బర్, మధూకర్, ప్రసాద్, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ చానల్ ద్వారా వేతనాలివ్వండి



వినతిపత్రం ఇస్తున్న రఘువరన్

నల్లబెల్లి : ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని కోరుతూ ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్స్, వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కల్లెపెల్లి రఘువరన్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ నర్సింహమూర్తి, ఎంపీఓ రవిలకు బుధవారం వినతిపత్రాలు అందజేశారు. అనంతరం రఘువరన్ మాట్లాడారు. ఒక్కో ఆపరేటర్ సుమారు 10 జీపీల విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఏడాదిగా వేతనాలు ఇవ్వకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. ఇకనైనా ప్రభుత్వం తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, గ్రీన్ చానల్ ద్వారా వేతనాలివ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర బాధ్యులు మార్త నరేశ్, సాటిక రజనికాంత్‌రెడ్డి, నాగరాజు, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

'గురిజాల ఎంపీటీసీ స్థానంలో కలపొద్దు'

నర్సంపేట రూరల్ : పాత ముగ్దుంపురం గ్రామాన్ని గురిజాల ఎంపీటీసీ స్థానంలో కలుపొద్దని బీఆర్‌ఎస్ పార్టీ గురిజాల క్లస్టర్ ఇన్‌చార్జ్ మోటూరి రవి కోరారు. నర్సంపేట మండలంలోని గురిజాలలో బుధవారం నిర్వహించిన సమావేశలంఓ ఆయన మాట్లాడారు. గ్రామం మండలంలో అతిపెద్దదని, గురిజాల ఎంపీటీసీ పరిధిలో 7 వేల ఓట్లు ఉన్నాయని తెలిపారు. గురిజాలకు రెండు ఎంపీటీసీలుగా విభజించాలని పలుమార్లు కోరినా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోలేదన్నారు. గురిజాల ఎంపీటీసీ పరిధిలోనే గుంటూరుపల్లి, జీజీఆర్‌పల్లి, చిన్న గురిజాల, గురిజాల ఉండగా మళ్లీ అదనంగా పాత ముగ్దుంపురం కలిపారని చెప్పారు. పాత ముగ్దుంపురం గ్రామాన్ని ప్రత్యేక ఎంపీటీసీగా ఏర్పాటు చేయాలని లేదా చెన్నారావుపేట ఎంపీటీసీ స్థానంలో విలీనం చేయాలని సూచించారు. సమావేశంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చిన్నపెల్లి నర్సింహ, మాజీ ఎంపీటీసీ గడ్డం కొమురయ్య, రైతు సమన్వయ కమిటీ కన్వీనర్ అన్న రాజమల్లు, మండల ఉపాధ్యక్షుడు అల్లి రవి, గడ్డం రాజు, గౌడ సంఘం అధ్యక్షుడు మచ్చిక దేవేందర్, కురుమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

పర్వతగిరి : మండల కేంద్రానికి చెందిన పుల్లూరి ఎల్లమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి వరద రాజేశ్వర్‌రావు బుధవారం పరామర్శించారు. తొలుత మృతురాలి చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, మాజీ డైరెక్టర్ పిన్నింటి సునీల్, ఐనవోలు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు బండెల వెంకన్న, దారం పూర్ణచందర్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రబోయిన సాంబరాజు, ఉపాధ్యక్షుడు కందికట్ల అనిల్, తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలో..

మండల కేంద్రానికి చెందిన ధర్మిని నారాయణ, చీదురు కృష్ణయ్య, పుల్లూరి ఎల్లమ్మ, నీరటి రాములు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. తొలుత మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చింతపట్ల సోమేశ్వర్‌రావు, మాజీ ఎంపీటీసీ మాడుగుల రాజు, ఏకాంతం తదితరులు పాల్గొన్నారు.

శివరామపురంలో..

రాయపర్తి : మండలంలోని శివరామపురంలో రేషన్ డీలర్ చెడుపాక దయాకర్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బుధవారం పరామర్శించారు. అలాగే గాదరి యాకయ్య మృతి చెందగా అతడి మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, తదితరులు పాల్గొన్నారు.

నివాళి

నర్సంపేట : బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు, మాజీ కౌన్సిలర్ మందుల శ్రీనివాస్ బుధవారం అనారోగ్యంతో మృతి చెందగా అతడి మృతదేహానికి స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, మాజీ కౌన్సిలర్లు దేవోజు సదానందం, బాణాల ఇందిర రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

గీసుకొండ : మండల కేంద్రానికి చెందిన వీరాటి బుచ్చిరెడ్డి మృతి చెందగా అతడి అంత్యక్రియల, ఇతర అవసరం కోసం గ్రామానికి చెందిన స్టేట్ బ్యాంకు రిటైర్డ్ మేనేజర్ పెగళ్లపాటి లక్ష్మీనారాయణ, ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ పసునూటి కల్యాణ్ బుధవారం రూ.5 వేలు చొప్పున ఆర్థికసాయం అందజేశారు.

పంటల నమోదు పారదర్శకంగా చేపట్టాలి

- నర్సంపేట ఏడీఏ దామోదర్‌రెడ్డి

నల్లబెల్లి : పారదర్శకంగా పంటలు నమోదు చేయాలని నర్సంపేట వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు (ఏడీఏ) దామోదర్‌రెడ్డి కోరారు. మండలంలోని గోవిందాపూర్‌లో పంటల నమోదును ఏఈఓ బన్న రజితతో కలిసి బుధవారం ఆయన తనిఖీ చేశారు. పంటల నమోదులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పంటల నమోదు క్లస్టర్ వారీగా కొనసాగుతోందని చెప్పారు. మండలంలో సుమారు రెండు వేల ఎకరాలకు సంబంధించి సర్వే నంబర్ల ఆధారంగా పంటల ఫొటోలు తీసి వివరాలను యాప్‌లో నమోదు చేయనున్నట్టు వివరించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.



పంటల నమోదును పర్యవేక్షిస్తున్న దామోదర్‌రెడ్డి

యువత ఆదర్శంగా నిలవాలి

- ఎస్సై అరుణ్‌కుమార్

నర్సంపేట రూరల్ : యువత ఉన్నతంగా ఎదిగి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఎస్సై అరుణ్‌కుమార్ కోరారు. నర్సంపేటలోని బాలాజీ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రిన్సిపాల్ రాంరాజ్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎస్సై అరుణ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యువత చదువులు, ఆటపాటల్లో ఆసక్తి పెంచుకుని రాణించాలని సూచించారు. మత్తు పదార్థాలు, ఇతర దురలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. సన్మార్గంలో పయనిస్తూ తల్లిదండ్రుల కీర్తిప్రతిష్టలు ఇనుమడింపజేయాలని తెలిపారు. సైబర్ నేరాలు, తదితరాలపై అవగాహన పెంచుకుని సమాజ చైతన్యంలో భాగస్వాములు కావాలని చెప్పారు.



మాట్లాడుతున్న ఎస్సై అరుణ్‌కుమార్

పోస్టర్ ఆవిష్కరణ



గీసుకొండ : మండలంలోని కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వద్ద రేవంత్ క్రియేటివ్ కాన్సెప్ట్ (ఆర్‌సీసీ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న సద్గురు సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాల పోస్టర్‌ను దేవాదాయ, అటవీ శాఖల మంత్రి కొండా సురేఖ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్‌సీసీ ఫౌండర్ రేవంత్ రాథోడ్ మాట్లాడారు. ఉత్సవాలకు రావాలని మంత్రిని కోరారు. సేవాలాల్ జయంతి రోజును ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని, సేవాలాల్‌తోపాటు మేరామయాడి ఆలయ నిర్మాణాలకు మండలంలో భూమి కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు రడం భరత్, ఉత్సవ కమిటీ చైర్మన్ బానోతు రాఘవేంద్ర, నాయకులు హాలావత్ రాజునాయక్, బాదావత్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

'వర్గీకరణపై పునరాలోచించాలి'

నల్లబెల్లి : ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి పునరాలోచించాలని మాల మహానాడు నాయకులు బట్టు సాంబయ్య, ఎన్నమల నర్సయ్య కోరారు. ఈ మేరకు వారు స్థానిక తహసీల్దార్ కృష్ణకు బుధవారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణతో మాల, మాల ఉపకులాలకు తీవ్ర అన్యాయం జరిగే ప్రమాదం ఉందన్నారు.

నేడు నులిపురుగుల నివారణపై శిక్షణ

చెన్నారావుపేట : నులిపురుగుల నివారణపై మండల కేంద్రంలోని రైతు వేదికలో నేడు (గురువారం) ఉదయం 11 గంటలకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సరోజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశాకార్యకర్తలు, సూపర్‌వైజర్లు, ప్రధానోపాధ్యాయులు, ఒక్కో పాఠశాల నుంచి ఒకరు చొప్పున ఉపాధ్యాయుడు శిక్షణకు హాజరు కావాలని కోరారు.

ముగిసిన బ్లాక్ లెవల్ క్రీడా పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్సై ప్రశాంత్

గీసుకొండ : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ మైదానంలో రెండ్రోజులుగా నిర్వహిస్తున్న బ్లాక్ లెవల్ క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో వాలీబాల్, షటిల్, రన్నింగ్, కబడ్డీ క్రీడల్లో పోటీలు నిర్వహించగా విజేతలకు ఎస్సై ప్రశాంత్ చేతుల మీదుగా మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పట్టాభి, వలంటీర్లు సురేశ్, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.